ఎక్స్‌రోడ్డులో యూటర్న్ మూసివేత

- ఇబ్బందుల్లో వాహనదారులు
- సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు

చంపాపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏండ్ల నుంచి కొనసాగుతున్న రహదారిపై రాకపోకలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. యూటర్న్ మూసివేతతో అదనంగా కిలోమీటర్ పొడవునా ప్రయాణం చేయాల్సి వస్తుంది. అంతేగాకుండా ఎదురెదురుగా వాహనాలు తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసుల నిర్ణయం వాహనదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కిలోమీటర్ అదనంగా ప్రయాణిస్తే పెట్రోల్, డీజిల్ ఆవిరవుతుంది. ఎయిర్‌పోర్ట్ ఇన్నర్‌రింగ్‌రోడ్‌లోని మందమల్లమ్మచౌరస్తా నుంచి చంపాపేటచౌరస్తా వెళ్లేందుకు సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు దారులు మూసివేశారు. కిలోమీటర్ దూరం అదనంగా ప్రయాణించి డీఎంఆర్ఎల్ ఎక్స్‌రోడ్‌లోని సాయిబాబా ఆలయం వద్ద యూటర్న్ తీసుకొని చంపాపేట చౌరస్తాకు వెళ్లాల్సి వస్తుంది. మందమల్లమ్మచౌరస్తా నుంచి చంపాపేట చౌరస్తాకు వెళ్లేందుకు వాహనదారులు కిలోమీటర్ అదనంగా ప్రయాణం చేయాల్సి రావడంతో వారు రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.



ఇన్నర్ రింగ్‌రోడ్‌లో చంపాపేట ఎక్స్‌రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు మూసివేసిన యూటర్న్



చంపాపేట నుంచి మందమల్లమ్మ చౌరస్తా వైపు వెళ్లే వాహనాలకు ఎదురుగా వస్తున్న వాహనాలు

వాహనాలు ఒకే గూటికి..

మందమల్లమ్మచౌరస్తా నుంచి చంపాపేట వైపు వెళ్లే వాహనాలు ప్రధాన రహదారిపై ఉన్న యూటర్న్ తీసుకొని కొన్ని ఏండ్ల నుంచి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. 6నెలల కిందట ట్రాఫిక్ పోలీసులు చంపాపేట ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయనే సాకుతో యూటర్న్‌ను మూసివేశారు. మందమల్లమ్మ చౌరస్తా నుంచి చంపాపేట, డీఎంఆర్ఎల్ చౌరస్తా వైపు వెళ్లే వాహనాల కోసం సాయిబాబా ఆలయం వద్ద ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను చెకింగ్ చేస్తున్నారు. చెకింగ్ అయిన తర్వాతనే వాహనాలు చంపాపేట వెళ్లేందుకు అక్కడ ఆలయం వద్ద ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన యూటర్న్ నుంచి తిరిగి వస్తున్నారు. డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీ కోసం ట్రాఫిక్ పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసుకొని వాహనదారుల వద్ద పాత బకాయిల వసూళ్లతో పాటు కొత్తగా చాలాన్లు విధిస్తున్నారు.

చంపాపేట ఎక్స్‌రోడ్డు వద్ద..

ఇన్నర్‌రింగ్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు చంపాపేట చౌరస్తా వైపు వెళ్లేందుకు, చంపాపేట నుంచి డీఎంఆర్ఎల్ చౌరస్తా వైపు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. చంపాపేట ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు స్పీడ్‌గా వెళ్తుంటే, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటే సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతంలో విధులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారుల అవసరాలు తీర్చాల్సింది పోయి కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు. లీటరు పెట్రోల్ వంద రూపాయలు దాటింది. కిలోమీటర్‌కు పైగా తిరిగి వస్తే పెట్రోల్, డీజిల్ అదనంగా ఖర్చు అవుతుంది. ట్రాఫిక్ పోలీసులు చంపాపేట ఎక్స్‌రోడ్డులో బారికేడ్లను తొలగించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

యూటర్న్ వద్ద బారికేడ్లను తొలగించాలి



మందమల్లమ్మ చౌరస్తా నుంచి చంపాపేట చౌరస్తాకు వచ్చే ప్రధాన రహదారి మధ్యలో ట్రాఫిక్ పోలీసులు యూటర్న్‌ను మూసివేశారు. యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలి. చంపాపేట చౌరస్తా నుంచి డీఎంఆర్ఎల్ చౌరస్తా వెళ్లేందుకు ఇన్నర్‌రింగ్‌రోడ్‌పై దారి కనుమరుగైంది. కిలోమీటర్ దూరం వెళ్లి మందమల్లమ్మ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకొని డీఎంఆర్ఎల్ చౌరస్తా వెళ్లాల్సి వస్తుంది.

- సుదర్శన్, వాహనదారుడు, చంపాపేట

ప్రమాదాల నివారణ కోసం..

ఇన్నర్‌రింగ్‌రోడ్‌లోని చంపాపేట ఎక్స్‌రోడ్డులో ప్రమాదాల నివారణ కోసం పై అధికారుల ఆదేశాలతో యూటర్న్ మూసివేశాం. పిసల్‌బండ నుంచి ఫ్లైఓవర్ మీదుగా వచ్చే వాహనాలు అతివేగంతో వస్తున్నందున యూటర్న్ బంద్ చేయాల్సి వచ్చింది. యూటర్న్ వద్ద సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటును పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- మహ్మద్ ఆసిఫ్, ట్రాఫిక్ సీఐ, సంతోష్‌నగర్ పీఎస్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

డివిజన్ అభివృద్ధే లక్ష్యం : రాగుల

వనస్థలిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధే తన లక్ష్యమని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ వెంకటరమణకాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్స్ ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ ఇంటి పన్నుల భారం తగ్గించాలని, తమ సమస్యలతో పాటు కాలనీ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌కు విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలతో పాటు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు శ్రీరాములు, కాలనీ అధ్యక్షులు కాశీపతి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, గాంధీ పాల్గొన్నారు.

శైలజకు కంప్యూటర్‌సైన్స్‌లో డాక్టరేట్

చాదర్‌ఘాట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్‌లో చైతన్యపురి మారుతినగర్ నివాసి పోకల శైలజ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆమె డాక్టరేట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ చేతుల మీదుగా ఇటీవల జరిగిన డాక్టరేట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో అందుకున్నారు. ప్రస్తుతం శైలజ వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.



సాధించిన డాక్టరేట్‌తో శైలజ



కాలనీ ముఖ ద్వారం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి, పాల్గొన్న కాలనీ ప్రతినిధులు

శ్రీహిల్స్‌కాలనీ ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన

సరూర్‌నగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లోని శ్రీహిల్స్‌కాలనీ ఫేజ్-1 ముఖ ద్వారం(ఆర్చి) నిర్మాణ పనులు ఆదివారం మొదలయ్యాయి. యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాంరావు, కోశాధికారి వెంకట్‌రెడ్డి, సభ్యులు బహుగుణనాయక్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంలో 40గంటల శిక్షణ

మన్సూరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో తలెత్తుతున్న ఆస్తి, కుటుంబ తగదాలను పరిష్కరించడంలో కోర్టుల కన్నా మధ్యవర్తిత్వ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కోర్టులతో పాటు కేంద్ర ప్రభుత్వం పేర్కొంటున్నాయని అమిక మధ్యవర్తిత్వ కేంద్రం అధ్యక్షురాలు జి.జ్యోతిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలతో ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడాన్ని దృష్టిలో ఉంచుకుని 2023లో మధ్యవర్తిత్వ చట్టాన్ని ప్రవేశపెట్టిందని, ఈ చట్టంలో భాగంగా సుశిక్షితులైన మధ్యవర్తులతో సమస్యలు పరిష్కరించాలని మధ్యవర్తిత్వ ప్రాజెక్టు కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు నియమ నిబంధనలను పాటిస్తూ శిక్షణ కేంద్రాలు సమస్యలను పరిష్కరించాలన్నారు. మధ్యవర్తిత్వ ప్రాజెక్టు సూచనల మేరకు జూలై 7వ తేదీ సోమవారం నుంచి 11వ తేదీ శుక్రవారం వరకు 40గంటల శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు సెల్: 7780404033 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న రిటైర్డ్ రిజిస్ట్రార్ ఓంప్రకాశ్

భరద్వాజ కాంప్లెక్స్ సొసైటీ కార్యవర్గం

చాదర్‌ఘాట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని భరద్వాజ కాంప్లెక్స్ మ్యాక్(మ్యూచివల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్) మెయిన్‌టెనెన్స్ సొసైటీకి ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ సీహెచ్ ఓంప్రకాశ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సొసైటీ అధ్యక్షుడిగా వై.గిరిధర్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చకిలం వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా జేవీ హన్మంత్‌రావు, కార్యవర్గ సభ్యులుగా సీ.అంబప్రసాద్, నవీన, ఎం.చంద్రమౌళి, ఎం.ఆశాజ్యోతి, అబిదాబేగం, ఎస్.సంతోష్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సొసైటీ కార్యవర్గాన్ని భరద్వాజ కాంప్లెక్స్ నివాసులందరు ఘనంగా అభినందించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎల్బీనగర్ : ఎల్బీనగర్‌లోని బహదూర్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. వారి పాఠశాల జీవితంలోని పదేళ్ల మధుర క్షణాలను గుర్తుచేసుకుని ఉబ్బితబ్బిబయ్యారు. తమ అనుబంధాలను, ఆప్యాయతలను పంచుకున్నారు. ఆ రోజులు మళ్లీ రావని భావోద్వేగానికి లోనయ్యారు.

మార్కెట్‌లో మహాకుంభాభిషేక పూజలు అభినందనీయం

- చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మిశ్రీనివాస్

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో కొలువై ఉన్న గరుడ అభయాంజనేయ స్వామికి మహాకుంభాభిషేక పూజలు నిర్వహించడం అభినందనీయమని మార్కెట్ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మిశ్రీనివాస్ అన్నారు. మూడు రోజులుగా వ్యవసాయ మార్కెట్‌లో ఆంజనేయస్వామికి మహాకుంభాభిషేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మార్కెట్‌లో ఎటుచూసినా భగవన్నామస్మరణ మార్మోగుతోంది. పూజల్లో చివరి రోజైన ఆదివారం భక్తులు పెద్దఎత్తున పాల్గొని 1008 కలశాలతో స్వామికి సహస్ర ఘటాభిషేకం, శిఖర పూర్ణాభిషేకం, సీతారాముల కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ చైర్‌పర్సన్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా మార్కెట్‌లో కొలువై నిత్యపూజలు అందుకుంటూ భక్తుల కోర్కెలు నెరవేరుస్తున్న గరుడ అభయాంజనేయస్వామికి మహాకుంభాభిషేకం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ చేగూరి వెంకటరమణ, సభ్యులు బట్కిరి వివేకానంద, దుగ్గు జగదీశ్, మాదారం కృష్ణ, వంజరి వినోద్, గంగా బాలాజీ, విశ్వం, తల్లం శ్రీకాంత్, అనిల్‌కుమార్, నూక సంతోష్, గందె శ్రీధర్, ప్రమోద్, సురేష్, మార్కెట్ వ్యాపారులు, ట్రేడర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ లక్ష్మిశ్రీనివాస్

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగస్వాములు కావాలి

- జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. లింగోజిగూడ డివిజన్‌లో ఆదివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని 300మంది పారిశుధ్య కార్మికులతో లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో చెత్తచెదారంతో పాటు పిచ్చి మొక్కలను తొలగిస్తారన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు ఈ కార్యక్రమానికి సహకరించి కాలనీలు, బస్తీలు పరిశుభ్రంగా ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఎంహెచ్‌ఓ నగేష్‌నాయక్‌లతో పాటు వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ నాయకులు జైపాల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, ప్రవీణ్, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట : చంపాపేట విద్యుత్ సెక్షన్‌లోని 11కేవీ రియల్ బేకరీ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఉదయ్‌నగర్, పద్మానగర్, గాయత్రీనగర్ ఎక్స్‌రోడ్డు, మందమల్లమ్మ ఎక్స్‌రోడ్డు, కర్మన్‌ఘాట్, నిర్మలానగర్, మైత్రీపురం కాలనీ, క్రాంతినగర్, లక్ష్మీనగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

11కేవీ పద్మానగర్ ఫీడర్‌లో..

చంపాపేట విద్యుత్ సెక్షన్‌లోని 11కేవీ పద్మానగర్ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 2:30గంటల నుంచి 5:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని పద్మానగర్, కళ్యాణీమోటర్, క్రాంతినగర్, శ్రీనిధికాలనీ, నిర్మలానగర్, జ్యోతినగర్, కర్మన్‌ఘాట్ విలేజీ, రాఘవేంద్రకాలనీ, హనుమాన్‌నగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సీపీఐ బాలాపూర్ మండల శాఖ మహాసభ

సరూర్‌నగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ బాలాపూర్ మండలశాఖ 6వ మహాసభ ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, జిల్లా కార్యదర్శి జంగయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రామికుల రాజ్యం సీపీఐతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రవీంద్రాచారి, జంగయ్య తదితరులు

బాలాపూర్ మండల కార్యవర్గం ఎన్నిక

సీపీఐ బాలాపూర్ మండల కార్యవర్గాన్ని ఆదివారం నాటి సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎం.చంద్రశేఖర్‌రెడ్డి మరోసారి మండల కార్యదర్శిగా ఎన్నియ్యారు. ఇతర కార్యవర్గంలో సహాయ కార్యదర్శిగా రెడ్యానాయక్, సభ్యులుగా పిచ్చి రాజు, డేరంగుల శంకరయ్య, జాజుల అంజయ్య, శివ, బండ యాదమ్మ, రమాపాండునాయక్, వీరస్వామి, కౌసల్య, దేవయ్య, రమేశ్, లక్ష్మమ్మ, పద్మ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కూకట్‌పల్లి : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. బాలానగర్ పీఎస్ పరిధిలోని పాపయ్యయాదవ్ నగర్‌లో నివాసం ఉంటున్న గడ్డ ప్రకాశ్‌రావు (45) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్‌కు తరలించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు

- సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో..
- రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారుల అండ
- కలెక్టర్ ఆదేశాలిచ్చినా పట్టించుకోని వైనం



సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు

సైదాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారుల అండతో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్రజలు, నేతలు సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. చెరువు బఫర్ జోన్ పరిధిలో భారీ భవన నిర్మాణంపై స్థానిక రాజకీయ నేతలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు అధికారి బిల్డర్, నేతల మధ్య బేరం కుదిర్చినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా..

సైదాబాద్ మండలం సింగరేణి కాలనీలోని సర్వే నంబరు 126 నుంచి 136, 146,127లోని స్థలాన్ని ప్రభుత్వ మిగులు భూమి(యూఎల్‌సీ)గా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రానుంది. భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని 20 ఆగస్టు, 2011న అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఎన్‌ఓసీ లేకున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంటి నిర్మాణాలకు అనుమతులిచ్చారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 1000కి పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి సైదాబాద్, సరూర్‌నగర్ మండలాల పరిధిలోకి రావడంతో రెవెన్యూ అధికారులు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ ముఖం చాటేస్తున్నారు.

సుందరీకరణ పనులు నత్తనడక

మిషన్ కాకతీయ కింద 2018లో సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం ప్రభుత్వం సుమారు రూ.15 కోట్లు మంజూరు చేసింది. నాటి నుంచి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. చెరువు చుట్టూ మట్టి కట్టలు కట్టడం, ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ఎఫ్‌టీఎల్‌లో ప్రజాధనంతో ఎలా చేపడతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మాగంటికి నేతల నివాళి

సరూర్‌నగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణం పట్ల మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన టీడీపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగారని, ప్రజలకు ఎంతో నిస్వార్థంగా సేవలు అందించారని వారు పేర్కొన్నారు. మాగంటి మరణవార్త తెలియగానే సబితారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు మాదాపూర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మాగంటికి నివాళులర్పిస్తున్న తీగల కృష్ణారెడ్డి

నత్తనడకన డ్రైనేజీ నిర్మాణ పనులు

చంపాపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు నెల రోజులు గడుస్తున్నా ముందుకు సాగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వకాలు జరపడంతో ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కన రహదారిపై తవ్వకాలతో గొయ్యి ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. తవ్వకాల పరిసరాలలో సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు, ప్రజలు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం పనులు మాత్రం నిలిచిపోయాయి. అధికారులు డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చంపాపేటచౌరస్తా నుంచి గాంధీచౌరస్తాకు వెళ్లే రోడ్డులో నిలిచిన డ్రైనేజీ పనులు

బాలుడి అదృశ్యం

మన్సూరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ జైపురికాలనీలో తన మనవడు మల్లేష్(11)తో గొరిగె ఐలమ్మ నివాసం ఉంటుంది. ఐలమ్మ సోదరుడు ఆగమయ్య కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అనంతరం అతడి భార్య కుమారుడు మల్లేష్‌ను ఐలమ్మ వద్ద వదిలేసి వెళ్లిపోయింది. నాలుగో తరగతి చదువుతున్న ఈ బాలుడు ఈనెల 5న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా.. బంధువులను ఆరా తీసినా మల్లేష్ ఆచూకీ లభించకపోవడంతో ఐలమ్మ నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

362 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- ఐటీ కారిడార్‌లో అత్యధికంగా నమోదవుతున్నట్లు వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 362 మందిపై కేసులు నమోదయ్యాయి. ఐటీ కారిడార్ చుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఎక్కువ మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తనిఖీల్లో వెల్లడవుతోంది. కమిషనరేట్ పరిధిలో మొత్తం 16 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు ఉండగా, ఆయా స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేకంగా నిర్వహించిన తనిఖీల్లో 362 కేసులు నమోదయ్యాయని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. తనిఖీల్లో 260 ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు 24, కార్లు 73, 5 భారీ వాహనాల డ్రైవర్లు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. పట్టుబడిన వారిలో బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కాన్సెంట్రేషన్) స్థాయి 35 ఎంజీ/100ఎల్ నుంచి 200ఎంజీ/100 ఎంఎల్‌గా ఉందని, అదేవిధంగా 30 మందిలో 201ఎంజీ/100ఎంల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్‌గా ఉందని తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన వారిపై బీఎన్ఎస్ చట్టం 105 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 64మంది, శంషాబాద్‌లో 42మంది, షాద్‌నగర్, చేవెళ్ల పీఎస్ పరిధుల్లో 32, జీడిమెట్ల పరిధిలో 31మంది చొప్పున మొత్తం 362మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం ప్రమాదకరమని, తనిఖీల్లో పట్టుబడితే పదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా ఉంటుందన్నారు.

నృత్య కళాకారులంటే ఎంతో గౌరవం: డా. చికోటి

మన్సూరాబాద్: కళలన్నా.. కళాకారులన్నా తనకెంతో ఇష్టమని ముఖ్యంగా నృత్య కళాకారులంటే చాలా గౌరవమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ధర్మరక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చికోటి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని మూన్‌వాకర్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో 45రోజులుగా నిర్వహించిన 12వ సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు 'ఎండబ్ల్యూడీఎస్ ఫెస్ట్-2025' పేరిట కొత్తపేటలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చికోటి ప్రవీణ్‌కుమార్ స్టూడియో నిర్వాహకుడు, నృత్య దర్శకుడు చక్రీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేపట్టిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం నృత్య దర్శకుడు చక్రీతో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమొంటోలను ప్రవీణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో మాదాపూర్ ఎస్ఐ అరుణ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు కాసుల సురేష్, శ్రీరాములుయాదవ్, రఘుపతిగౌడ్, నాయకులు సామ మహేశ్వర్‌రెడ్డి, దత్తు పాల్గొన్నారు.



డ్యాన్స్ మాస్టర్ చక్రీ, చిన్నారులతో కలిసి సరదాగా డ్యాన్స్ చేస్తున్న ప్రవీణ్‌కుమార్